క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నష్టం

గన్నవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం జరిగిందని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు సూరగాని సాంబశివరావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధులతో వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించే పరిస్థితి లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు, రుణమాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశానికి తిండి పెట్టే రైతులను, వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఇప్పటికైన కేంద్రం స్పందించి రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు రుణమాఫీ ప్రకటించాలని కోరారు. రైతాంగంపై భారం మోపే విద్యుత్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు నక్కా రామారావు, ఆవుటపల్లి సాంబయ్య, కొలుసు శ్రీమన్నారాయణ, మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కంకిపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో రూ. 43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించామన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, సర్పంచి ఇ.శివనాగలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

గన్నవరం: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని తెంపల్లి గ్రామ సర్పంచి కొలుసు శిరీష మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఇ. సత్యకుమార్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధినితో పాటు సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదన్నారు. కనీసం ఇంటి పన్నులు కూడా వసూలు చేయడం లేదని ఆరోపించారు. ఈ విషయమై గట్టిగా ప్రశ్నించినందుకు హర్షవర్ధిని భర్త చిదంబర కుమార్ తనకు ఫోన్ చేసి అసభ్యకరంగా తిట్టడంతో పాటు తనపై దాడి చేసినట్లు తెలిపారు. వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలకు కనీసం సమాధానం కూడా చెప్పడం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామంలో సమగ్ర విచారణ జరిపి విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ పంపిణీపై క్షేత్రస్థాయి సర్వే



ఉయ్యూరు: రేషన్ పంపిణీ విధానంపై సమగ్ర సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఉయ్యూరు ఆర్డీఓ రాజు అన్నారు. ఉయ్యూరు మండలంలోని గండిగుంట, కాటూరు గ్రామాల్లో మంగళవారం రేషన్ పంపిణీపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ పౌరసరఫరాల సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు రేషన్ పంపిణీపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ ఎలా ఉంది? ఇంకా ఏం కోరుకుంటున్నారు? వంటి ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. సమగ్ర సర్వే జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు.

విజయవాడ చాంబర్ నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(వీసీసీఐ) నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. గాంధీనగర్‌లోని చాంబర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం కాగా ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నిక చేపట్టారు. చాంబర్ అధ్యక్షుడిగా గద్దం బాల వెంకట రవికుమార్, ఉపాధ్యక్షులుగా వీవీకే నరసింహారావు, దర్శి శ్రీనివాసు, జాయింట్ సెక్రటరీలుగా ఈమని దామోదరరావు, బాలకృష్ణ లోయ, కోశాధికారిగా తమ్మన శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన ఎన్నికల్లో వక్కలగడ్డ శ్రీకాంత్ 12 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతుందని ఎన్నికల అధికారి కేవీవీ పరమేశ్వరరావు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి సాగు విధానాలు అవలంబించాలి
- గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు



వేలేరులో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్ రూరల్: వరి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గించుకోవడమేకాక అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా రిసోర్స్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో బాపులపాడు మండలంలోని వేలేరులో వరిసాగులో యాజమాన్య పద్ధతులపైనా, బొమ్ములూరులో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపైనా రైతులకు మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా రిసోర్స్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు విధానాలను అవలంభించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. అంతేకాకుండా పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుందని వివరించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం వరి పంటలో కలుపు మొక్కలను నివారించేందుకు నాట్లు వేసిన 30 రోజుల్లో కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ పద్మజ, మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని, రైతు నాయకుడు వేములపల్లి శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



పోటీల్లో గెలిచిన పోరంకి భాష్యం విద్యార్థులు

పెనమలూరు: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని పోరంకి భాష్యం బ్లూమ్స్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తెలిపారు. పాఠశాలలో మంగళవారం పతకాలు గెలిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహాలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన ఆంధ్రా లయోలా కాలేజీలో జరిగిన జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్ తైక్వాండో పోటీల్లో పోరంకి భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు 47 మంది పాల్గొన్నారని చెప్పారు. వీరిలో 6 మంది విద్యార్థులు గోల్డ్, 5 మంది సిల్వర్, 10 మంది బ్రాంజ్ పతకాలు గెలిచారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి అంకమరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



మండలంలోని సాయిపురం-ముదునూరు గ్రామాల మధ్య చంద్రయ్య డ్రెయిన్ ప్రవహిస్తుంది. దీనిపై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వంతెనపై ఉన్న రహదారి సగానికి పైగా కోతకు గురైంది. దీంతో స్థానికులు, రైతులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. రైతులు వ్యవసాయానికి అవసరమైన ట్రాక్టర్లు రాలేకపోకవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రాణభయంతో వంతెన దాటుతున్నారు. నిత్యం వంతెనపై రాకపోకలు సాగించే వారికి ఇబ్బందిగా తయారైంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-ఉయ్యూరు

మధ్యాహ్న భోజన పథకం మెనూ చార్జీలు పెంచాలి



ఉంగుటూరులో మాట్లాడుతున్న సమ్మక్క

ఉంగుటూరు: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో చేసిన మార్పులకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని ఆ పథకం కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి గండికోట సమ్మక్క అన్నారు. ఉంగుటూరులోని కామ్రేడ్ మానికొండ సూర్యావతి కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జనరల్ బాడీ సామావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సమ్మక్క పాల్గొన్ని మాట్లాడారు. పెరిగిన నిత్యావసర ధరలను పరిగణనలోకి తీసుకుని మెనూ చార్జీలు ఒక్కొక్కరికి రూ. 20 చెల్లించాలని కోరారు. కొన్ని పాఠశాలల్లో వంట షెడ్లు లేక పోవడంతో ఆరుబయట చెట్ల కింద వంట చేస్తూ అవస్తలు పడుతున్నామని చెప్పారు. వంటకు కావలసిన పాత్రలు ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనాన్ని పెంచాలని, వంటకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు, కందిపప్పు, చింత పండు, పామాయిల్ తదితర సరుకులు సివిల్ సప్లయ్ ద్వారా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని ప్రాంతాల్లో రాజకీయ వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఇప్పటికైనా వాటిని ఆపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు, సంఘ కార్యదర్శి కోటేశ్వరి, ఉపాధ్యక్షురాలు మహబూబీ, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న విముక్తి ప్రతినిధులు అపూర్వ, పుష్పకుమారి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అక్రమ రవాణా బాధిత మహిళల రాష్ట్ర సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అపూర్వ, పుష్పకుమారి ప్రభుత్వాన్ని కోరారు. అక్రమ రవాణా బాధిత మహిళలకు నష్టపరిహారం అందించడంతో పాటు వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వారికి అందేలా చేసి కమ్యూనిటీ ఆధారిత పునరావాసం పేరుతో ప్రత్యేకంగా ఒక పథకం రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో బాధిత మహిళలతో సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ అక్రమ రవాణా బాధిత మహిళల సమస్యలపై సీఎం చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత దృష్టి సారించాలన్నారు. వ్యభిచారం, అక్రమ రవాణా నుంచి బయటపడిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధిని కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు.

మూడు గంటల్లోనే తప్పిపోయిన బాలిక అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీసీపీ హరికృష్ణ, సీఐ దుర్గాప్రసాద్

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీస్ స్టేషన్ పరిధి ప్రశాంతినగర్‌లో మంగళవారం ఉదయం ఇంటి నుంచి తప్పిపోయిన 11 ఏళ్ల బాలికను మూడు గంటల్లోనే పోలీసులు వెతికి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనపై డీసీపీ టి.హరికృష్ణ, నున్న సీఐ దుర్గాప్రసాద్‌తో కలిసి నున్న పీఎస్‌లో విలేకరులతో మాట్లాడారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలక్ట్రీషియన్‌గా అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం చేసుకొంటూ జీవనం సాగిస్తున్న బోయిన రాంబాబు కుమార్తె(11) స్థానిక లహరి స్కూల్ నందు 6వ తరగతి చదువుతోంది. హోం వర్క్ చేయలేదని తల్లి మందలించింది. అనంతరం చిన్నారి తల్లి పాల ప్యాకెట్ కోసం వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి ఇంటి వద్ద కూతురు కనిపించలేదు. వెంటనే నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై డీసీపీ హరికృష్ణ ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు.

నగరంతో పాటు జిల్లాలోని అన్ని పీఎస్‌లకు సమాచారం చేరవేసి, రెస్క్యూ టీమ్‌లను రంగంలోకి దించి గాలింపు చర్యలు వేగవంతం చేశారు. ఈ క్రమంలో దేవినేని గాంధీపురంలో ఓ ఇంటి వద్ద బాలికను సీఐ దుర్గాప్రసాద్ గుర్తించి పీఎస్‌కు తీసుకువచ్చారు. తల్లిదండ్రులను పిలిపించి, బాలికను అప్పగించారు. నున్న సీఐ ఎస్.దుర్గాప్రసాద్‌ను నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు అభినందించారు. డీసీపీ సీఐకి రివార్డును ప్రకటించారు. పోలీసు అధికారులకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



ఉయ్యూరు: సామాజిక స్పృహతో విద్యనభ్యసించడం ద్వారా సమాజానికి మంచి జరుగుతుందని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ జాన్ డేవిడ్ పేర్కొన్నారు. గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చైతన్య విద్యార్థులు పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ జాన్ డేవిడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే వాతావరణ కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకొని సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ధీరేంద్ర, ఏజీఎం మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం




గన్నవరం రూరల్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల వైద్యాధికారి శ్రీ హర్ష చెప్పారు. రామచంద్రాపురం గ్రామంలో మంగళవారం 104 వాహన వైద్య సేవల్లో ఆయన రోగులకు సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ దీర్ఘకాలిక వ్యాధులకు క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన మందులు వాడాలని అన్నారు. షుగర్, బీపీ వంటి వ్యాధులకు తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది పర్వీన్, ఝాన్సీ రాణీ, ప్రవీణ్, సుజాత పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

పెనమలూరు: అప్పుచేసి తిరిగి కట్టలేక తన భర్త అదృశ్యమయ్యాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. తాడిగడప శ్రీనివాస నగర్ కాలువ కట్టకు చెందిన అల్లూరి శిరీష, నాగఫణీంద్ర భార్యభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త పోరంకి సెంటర్‌లో జిరాక్స్ షాపు నిర్వహిస్తాడు. అయితే నాగఫణీంద్ర జూన్ నెలలో ఇంట్లో ఉన్న రూ. 7 లక్షలు విలువ చేసే బంగారం, బయట వ్యక్తుల వద్ద రూ. 25 లక్షలు అప్పు చేసి ఇంట్లో చెప్పకుండా పారిపోయాడు. శిరీష అతనికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తుంది. భార్య, పిల్లలను వదిలేసి పారిపోవడంతో అప్పులు ఇచ్చిన వారు నాగఫణీంద్ర కుటుంబ సభ్యులను ప్రశ్నించసాగారు. దీంతో భార్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పునాదిపాడులో చోరీ



కంకిపాడు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన దేవరపల్లి పద్మ, పవన్‌కుమార్ భార్యాభర్తలు. పద్మ కంకిపాడు పీహెచ్‌సీలో సీఈఓగా పనిచేస్తోంది. ఈనెల 29న యథావిధిగా విధులకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న బీరువా తాళాలను సైతం పగలకొట్టి అందులో ఉన్న 15 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఘటనాస్థలాన్ని ఎస్ఐ సందీప్ సందర్శించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డంపింగ్ యార్డు ప్రాంతంలో చెత్త తొలగించండి

తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు



తాడిగడప వాసులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: తాడిగడప-పెదపులిపాక రోడ్డులో గతంలో ఉన్న డంపింగ్ యార్డు ప్రాంతంలోని చెత్తను వెంటనే తొలగించాలని వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు ఆదేశించారు. డంపింగ్ యార్డు ప్రాంతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తూ గతంలో రోడ్డు పక్కనే చెత్త డంపింగ్ యార్డు ఉండటంతో పరిస్థితులు దారుణంగా మారాయన్నారు. డంపిగ్ యార్డు తొలగించినా చెత్త తీయలేదని తెలియజేశారు. వెంటనే చెత్త నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ చెత్త తొలగిస్తామని హామీ ఇచ్చారు. కాగా లిమ్రా కాలనీ మురుగు నీటికి డ్రైనేజీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని కమిషనర్ తెలిపారు. అలాగే టీచర్స్ కాలనీలో కూడా డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రామ్‌కుమార్, గోపి, చాణుక్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి చెస్ పోటీలు



బాలుర విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న దినేష్



బహుమతి అందుకుంటున్న విజేత పావని

గన్నవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మండల స్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. హెచ్‌సీఎల్, హీల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సౌజన్యంతో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత పోటీలను హైస్కూల్ హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్ర భవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడా, సాంస్కృతిక రంగాలపై దృష్టి సారించాలని చెప్పారు. విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్న వాకర్స్ అసోసియేషన్, హెచ్‌సీఎల్, హీల్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌ను అభినందించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు తమవంతు తోడ్పాటునందిస్తున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ తెలిపారు. అనంతరం జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో విజేతగా ఆర్. దినేష్(కేసరపల్లి), రన్నర్‌గా పి. మల్లికార్జున్(గన్నవరం), తృతీయ స్థానంలో ఐ. జ్ఞానసుందర్(పెద అవుటపల్లి) నిలిచారు. బాలికల విభాగంలో విజేతగా టి. పావని(గన్నవరం), రన్నర్‌గా టి. దీపిక(గొల్లనపల్లి), తృతీయ స్థానంలో ఆర్. హేమ(కేసరపల్లి) బహుమతులను అందుకున్నారు. హెచ్‌సీఎల్, హీల్ ఫౌండేషన్ సమన్వయకర్త బీ సత్యనారాయణరావు, వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కామల సుబ్బారావు, వ్యాయామోపాధ్యాయుడు ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ

విజయవాడరూరల్: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గ్రామాల్లో బుధవారం నుంచి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, రూరల్ మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ గ్రామ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు సరఫరా చేయడం ద్వారా వ్యాధుల బారిన పడే అవకాశం ఉండదన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులను ముందస్తు చర్యల ద్వారా సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. తాగునీటి సరఫరా అయ్యే పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, గ్రామాల్లో ఎన్ని కుళాయి కనెక్షన్లు ఉన్నాయనే వివరాలను సేకరించాలన్నారు. అలాగే పైపులైన్ల మరమ్మతులు, వాటి వివరాలను రికార్డు చేయాలన్నారు. ప్రతి ఓవర్‌హెడ్ ట్యాంక్ పైన తప్పనిసరిగా మూతలు ఏర్పాటు చేయాలని తెలిపారు. డ్రైనేజీ కాల్వలు శుభ్రంగా ఉండేందుకు ప్రత్యేక సిబ్బందితో పనులు చేయించాలని చెప్పారు. వైద్యసిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, మలేరియా, డెంగ్యూ లాంటి రోగాలపై సర్వే చేయాలని వివరించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, ప్రత్యేక వాహనాల ద్వారా చెత్త సేకరించి డంపింగ్ కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు, గ్రామ సచివాలయ కార్యదర్శులు, వైద్యసిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై నిర్వహించిన ఆపాత మధురాల సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కె. ఉమాశంకర్, లక్ష్మణ్ నాయక్, రవికిరణ్, బీహెచ్ కామేశ్వరి, కల్యాణి శిరీష, మల్లీశ్వరి కుసుమాంజలి పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ నూతన గాయనీ గాయకులను ప్రోత్సహించాలని సూచించారు.

ఇంటిపై దౌర్జన్యం చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: పోరంకిలో యువతి ఇంటిపై దౌర్జన్యం చేసిన వ్యక్తులపై పోలీసులు మంగళవాకం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి విష్ణుపురం కాలనీలో యువతి తన కుటుంబ సభ్యులతో ఉంటుంది. అయితే సోమవారం కొల్లి రోహిత్, పసల మహేంద్ర, పసల రాజేంద్ర, బసవ అనే వ్యక్తులు ఇంటి తలుపులు, కిటీకీలు కొట్టి దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించి అసభ్య పదజాలంతో దూషించి, చంపుతామని బెదిరించారు. ఈ ఘటనతో భయభ్రాంతులైన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.